ముస్లింలకు ఇఫ్తార్ విందు

నస్రుల్లాబాద్‌లోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్

నస్రుల్లాబాద్, మార్చి 29 : మండల కేంద్రంలోని మసీద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లింలకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, సాయి, రాములు, మోసిన్, భాస్కర్, అన్వర్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బాన్సువాడ టౌన్, మార్చి 29 : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పనుల నిమిత్తం బాన్సువాడకు వచ్చే ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నరాంపూర్ తండాలో..

బాన్సువాడ రూరల్, మార్చి 29 : మండలంలోని చిన్నరాంపూర్ తండాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి రాజు, తండా పెద్దలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ హరిసింగ్, ఫకీరానాయక్, బీమ్లా నాయక్, దన్ను, దూప్‌సింగ్, విఠల్, రఘురాం, నాగరాజు, భాస్కర్, సంతోష్ పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరి రిమాండ్

భిక్కనూరు, మార్చి 29 : పాత కక్షలు మనసులో పెట్టుకొని అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి రాడ్లతో దాడి చేసి గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గంగయ్యగారి రాజశేఖర్, అతని తమ్ముడు బాబు పాత కక్షలు మనసులో పెట్టుకొని వీరి చిన్నాన్న అయిన గంగయ్యగారి యాదగిరి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారు. వీరు వెంట తెచ్చుకున్న రాడ్లతో తల, కాళ్లపై కొట్టి గాయపర్చారు. శనివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిందరినీ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మరో వ్యక్తి..

తల్లి, తండ్రిని కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వాపూర్‌కు గ్రామానికి చెందిన మంద మల్లేశం ఇటీవల తన తండ్రి మంద దేవయ్య, తల్లి సిద్దవ్వను కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం మంద మల్లేశంను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'పారిశుద్ధ్యం'పై పట్టింపేదీ?

- మురికి కాలువల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు
- గ్రామాభివృద్ధిలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

చెత్త కుప్పగా మారిన అంబారీపేట బస్‌స్టాప్

అంబారీపేటలోని ఓ వార్డులో రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

బీబీపేట్(దోమకొండ), మార్చి 29 : సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. కానీ.. ఆ స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లకపోవడంతో పారిశుద్ధ్య పనులు కుంటుపడుతున్నాయి. దోమకొండ మండలంలోని అంబారీపేటలో స్పెషల్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. పారిశుద్ధ్య పనులు సరిగ్గా చేపట్టకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఆయా వార్డులు, అంబారీపేట నుంచి కోనాపూర్‌కి వెళ్లే రోడ్డులో మురికి కాలువలు తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పలు వార్డుల్లో మురికి కాలువలను శుభ్రం చేయకపోవడంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు వస్తున్నాయని వార్డు సభ్యులు వాపోతున్నారు. అంబారీపేట బస్‌స్టాప్ చెత్త కుప్పగా మారింది. ప్రయాణికులు అక్కడ కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించాల్సిన స్పెషల్ ఆఫీసర్లు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అంబారీపేట గ్రామ పంచాయతీ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ సందర్శించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువలో పిచ్చి మొక్కల తొలగింపు

డిస్ట్రిబ్యూటరీ-10 కాలువలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న లస్కర్లు

బాన్సువాడ రూరల్, మార్చి 29 : చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేందుకు డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను శనివారం లస్కర్లు తొలగించే పనులు చేపట్టారు. డిస్ట్రిబ్యూటరీ-10 కాలువలో చెత్తతోపాటు ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. కాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందదనే ముందు జాగ్రత్తగా తొలగించినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అవుట్ సోర్సింగ్ నియామకాల విచారణ వేగవంతం చేయాలి

బీసీ విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, మార్చి 29 : ఇటీవల మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో జరిగిన అవకతవకలపై విచారణను వేగవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో బాధిత అభ్యర్థులతో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయంగా రావాల్సిన పోస్టులను డబ్బులకు అమ్ముకున్న మ్యాన్ పవర్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డర్ కాపీ ఇచ్చిన ఉద్యోగ నియామకాలను రద్దు చేసి మెరిట్ జాబితా ప్రకారం అర్హత ఉన్న నిరుద్యోగ అభ్యర్థులతో నియామకాలు పూర్తి చేయాలన్నారు. జాబ్ మీద ఆశతో కొంతమంది అభ్యర్థులు డబ్బు సర్దుబాటు చేసి ఇచ్చిన తర్వాత కూడా వేరే వాళ్లతో ఎక్కువ మొత్తంలో బేరం కుదుర్చుకొని తక్కువ డబ్బులు ఇచ్చిన వాళ్లకు వాపస్ ఇచ్చారని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్, బాధిత అభ్యర్థులు రవి, సురేశ్, మమత, రఘువరన్, గణేశ్, సంజయ్ పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల ప్రదర్శనకు ఏర్పాటు పూర్తి

కామారెడ్డి, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో నిర్వహించనున్న ఎడ్లబండ్ల ప్రదర్శణకు సదర్ సంఘం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి కాలం కారణంగా ప్రజలు తాగునీరు, బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ట్రాక్టర్లతో చదును చేసి శుభ్రం చేశారు. పెద్దమ్మ ఆలయాన్ని అందంగా అలంకరించారు. రెండు సంవత్సరాల తర్వాత ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తుండడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో అన్ని ఏర్పాట్లు చేశారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ

పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ

మాచారెడ్డి, మార్చి 29 : మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌ను ఏఎస్పీ చైతన్యారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉగాది వేడుకల రోజు ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శనను శాంతియుతంగా పూర్తిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఆమె వెంట కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్ ఉన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బీబీపేట్(దోమకొండ), మార్చి 29 : దోమకొండలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్‌రావు శనివారం శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఉగాది, రంజాన్ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్ద, పలు పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, మార్చి 29 : మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన జెల్ల సాయిలు(48) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంటి ఎదుట ఉన్న రేకుల ఇంట్లో డిష్ వైర్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో

బాన్సువాడ, మార్చి 29 : బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని తాడ్కోల్ గ్రామ సమీపంలో ఓ ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోను నడుపుతున్న వ్యక్తితోపాటు మరో ఇద్దరు మద్యం తాగి ఉన్నారు. వీరిలో ఆటో నడుపుతున్న వ్యక్తి విద్యుత్ స్తంభాన్ని ఢీట్టాడు. ఆటోలో ఉన్న వ్యక్తులు దిగి వైర్లను తొలగించేందుకు వెళ్తుండగా స్థానికులు కరెంటు ఉందని అరవడంతో పక్కకు వెళ్లిపోయారు. దీంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. మధ్యాహ్నం వేళ పాఠశాలలు వదిలే సమయంలో రోడ్డుపై ఆటోను నడిపితే ప్రాణాలు పోయేవని, ఆటోనడిపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేషన్ కార్డుల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న గ్రామ కార్యదర్శులు

లింగంపేట, మార్చి 29: మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వే నుంచి గ్రామ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో నరేశ్‌కు శనివారం వినతి పత్రం అందించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే తమకు పని భారం పెరిగిందన్నారు. ఇంటి పన్ను వసూలు, ఎల్‌ఆర్‌ఎస్, తాగునీటి వసతుల కల్పన, ఇందిరమ్మ గృహాల రెండో విడుత సర్వే, ఇందిరమ్మ గృహాల ఎల్1, ఎల్2, ఎల్3 జాబితా సమర్పించడంతో పాటు ఉపాధి హామీ, పారిశుద్ధ్య పనుల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమకు పని భారం అధికంగా ఉన్నందున రేషన్ కార్డుల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కార్యదర్శుల జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కాలేదు'

పెద్ద కొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు

పెద్ద కొడప్‌గల్,మార్చి 29 : మండల కేంద్రంలోని చెరువులో ఉపాధి హామీ కూలీలు ఫిష్ పాండ్ పనులు చేపడుతున్నారు. ఈ వారంలో రెండు రోజులు మాత్రమే ఆన్‌లైన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు వేశారు. మిగతా నాలుగు రోజులు పని చేసినా ఆన్‌లైన్‌లో హాజరు నమోదుకాలేదని, పనిచేసినా డబ్బులు రావని శనివారం ఉపాధి కూలీలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నాలుగు రోజుల నుంచి ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌వేర్ సమస్యతో ఫిష్ పాండ్ పనికి సంబంధించిన హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో రావడం లేదన్నారు. ఈ సమస్య పై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, పని చేసిన కూలీలకు తప్పకుండా డబ్బులు వస్తాయని ఏపీవో సుదర్శన్ హామీ ఇచ్చారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ఉగాది ఆఫర్: ఫ్రీ ప్లాట్ పొందండి. కేవలం 1,000/- రూపాయలతో 6 లక్షల 150 గజాలు ప్లాట్ పొందండి. బుకింగ్ అమౌంట్: 10,000/- EMI 30 నెలలు. Ph: 9392256585 / 7238916456.
NT-330921-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నీటి తొట్టిలను శుభ్రం చేయాలి

పెద్దకొడప్‌గల్ (పిట్లం),మార్చి 29 : పిట్లం మండలంలోని గ్రామాల్లో ఉన్న పశువుల నీటి తొట్టిలను శుభ్రం చేయాలని పశు వైద్యాధికారి సంతోష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిట్లం మండలంలోని గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా గ్రామాల్లో ఉన్న పశువుల నీటి తొట్టిలను శుభ్రం చేసి, మరమ్మతులు ఉంటే చేయించి పశువుల దాహం తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు పెద్దపాతంగల్‌లో కుస్తీ పోటీలు

రామారెడ్డి (గాంధారి)మార్చి 29 : గాంధారి మండలంలోని పెద్దపాతంగల్ గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు వీడీసీ సభ్యులు శనివారం తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా కుస్తీ పోటీలకు మల్లయోధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రాలను సొసైటీ పరిధిలోనే కొనసాగించాలి

మల్లూర్‌లో నిర్వహిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ సమావేశం

నిజాంసాగర్, మార్చి 29 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సంస్థకు అప్పజెప్పకుండా సొసైటీ పరిధిలోనే కొనసాగించాలని రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మండలంలోని మల్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో సొసైటీ అధ్యక్షురాలు కళ్యాణీ విఠల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మహాజన సభ నిర్వహించారు. ముందుగా సీఈవో సాయిలు వార్షిక జమా ఖర్చుల నివేదిక చదివి వినిపించారు. అనంతరం అధ్యక్షురాలు మాట్లాడుతూ..మహాజన సభలో రైతుల సూచనల మేరకు ఎకరాకు 25 క్వింటాళ్ల జొన్నను ప్రభుత్వం కొనగోలు చేయాలని, ఏకకాలంలో రూ.రెండు లక్షల రణమాఫీ చేయాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. మల్లూర్ సొసైటీ పరిధిలోని రెండు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సంస్థకు కేటాయించారని, దీన్ని విరమించుకోవాలని, సొసైటీ పరిధిలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగేలా చర్యలు చేపట్లాని రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో సొసైటీ వైస్‌చైర్మన్ రామ్ సింగ్, మారేడి వెంకట్రాంరెడ్డి, కృష్ణారెడ్డి, బాబుసేట్, జయంత్‌రెడ్డి, హన్మాండ్లు, బుడిమి శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది సత్యనారాయణ, విఠల్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాన్నిచ్చిన ఓటీఎస్ పథకం



రైతు నుంచి రుణం డబ్బులు స్వీకరిస్తున్న జీఎం లింబాద్రి

లింగంపేట, మార్చి 29: బకాయిల వసూలు కోసం అమలు చేసిన ఓటీఎస్ పథకం ద్వారా సత్ఫలితాలు వచ్చాయని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జీఎం లింబాద్రి వెల్లడించారు. మండల కేంద్రంలోని సహకార బ్యాంకును శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఓటీఎస్ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా 53కోట్ల రూపాయిలు వసూలైనట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో అధిక మొత్తంలో బకాయిలు వసూలయ్యాయన్నారు. లింగంపేట బ్యాంకు పరిధిలో రూ మూడు కోట్లు వసూలయ్యాయన్నారు. లింగంపేట సహకార బ్యాంకు ఎన్‌పీఏ 8 శాతానికి వచ్చిందని, ఓటీఎస్ పథకం శనివారం ముగిసిందన్నారు. ఏప్రిల్ నుంచి రుణాలు చెల్లించే వారికి ఓటీఎస్ పథకం వర్తించదని పేర్కొన్నారు. ఆయన వెంట సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, సీఈవో పెంటయ్య, బ్యాంకు సిబ్బంది, రైతులు ఉన్నారు.

'అగ్నివీర్'కు జప్తిజాన్కంపల్లి యువకులు

ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైన సాయిబాబా, ప్రశాంత్

నాగిరెడ్డిపేట, మార్చి 29: మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జోడు సాయిబాబా, మంగ ప్రశాంత్ అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇద్దరివీ రైతు కుటుంబాలే. జోడుకాంతం- పోచమ్మల కుమారుడైన సాయిబాబా డిగ్రీ చదువుతున్నాడు. మంగ పోచయ్య-రాధమ్మల కుమారుడైన ప్రశాంత్ కూడా డిగ్రీ చదువుతున్నాడు. ఇరువురూ తమ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నారు. చిన్ననాటి నుంచి మంచి మిత్రులు. కలిసి చదువుకున్నారు. కలిసి ఆర్మీలో అగ్నివీర్‌కు ఉద్యోగాల కోసం సన్నద్ధం అయ్యారు. వారి కష్టం ఫలించి ఇద్దరు అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో..తల్లితండ్రులతో పాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి ఇద్దరు ఒకే సారి ఆర్మీకి ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారని గ్రామ మాజీ సర్పంచులు దేశబోయిన సాయిలు, లక్మాగౌడ్ వారిని అభినందించారు.

పాఠశాలల్లో ఉగాది సంబురాలు

లింగంపేట, మార్చి 29 : మండలంలోని ఐలాపూర్, ఎల్లమ్మ తండాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉగాది పండుగ సంబురాలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం వినిపించారు. ఉగాది పచ్చడి తయారు చేసి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేవించారు. ఎల్లమ్మ తండాలో నిర్వహించిన సంబురాల్లో ఎంఈవో షౌకత్ అలీ పాల్గొన్నారు. ఐలాపూర్ పాఠశాల హెచ్‌ఎం దామోదర్ సిద్ధాంతి వేషధారణ వేసి పంచాంగం చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పద్మ, శివానంద, లావణ్య, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్, మార్చి 29 : మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మహేందర్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ..గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ఆరుబయట, మేడపైన పండుకున్నా ఇంట్లో ఉన్న వస్తువులపై జాగ్రత్త వహించాలన్నారు. తాళం వేసి ఊరికి వెళితే, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29: గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊళ్లకు వెళ్లిన కుటుంబాలు, తాళాలు వేసిన ఇండ్లు గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. బయట పార్కింగ్ చేసిన బైక్‌లు, కొట్టాల్లో కట్టేసిన పశువులు, మేకలు, బావుల వద్ద మోటర్లు, ట్రాక్టర్ బ్యాటరీలు, కాపర్ వైర్లు, బస్‌స్టాప్‌లు, బస్సుల్లో సెల్‌ఫోన్లు దొంగతనం చేస్తున్నారన్నారు. వేసవి ప్రారంభమైనందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దుస్తుల పంపిణీ

నాగిరెడ్డిపేట, మార్చి 29: మండల కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయంలో పని చేస్తున్న హక్కు పూజారులు, సిబ్బందికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొంసాని హన్మంత్‌రెడ్డి శనివారం కాషాయ దుస్తులు అందజేశారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా సిబ్బందికి ఒకే రకమైన డ్రెస్‌కోడ్ ఉండాలనే ఉద్దేశంతో తన సొంత డబ్బులతో దుస్తులు కొని అందజేశారు.

ఆలయాల వద్ద బందోబస్తు

లింగంపేట, మార్చి 29: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించే ఉత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఉగాది పండుగ నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహన పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. సీఐ వెంట ఆర్ఐ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు దుర్శెట్టి అశోక్, సభ్యులు ఉన్నారు.

పాఠశాలకు గ్రంథాలయ సామగ్రి అందజేత

రామారెడ్డి, మార్చి29 : మండలంలోని మద్దికుంట గ్రామంలో శనివారం మండల పరిషత్ పాఠశాలకు యునిమనీ ఫైనాన్స్ సర్వీస్ కంపెనీ వారి సౌజన్యంతో కామారెడ్డి బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన గ్రంథాలయ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజన్న, రీజినల్ మేనేజర్ రాజ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ బొమ్మిడి సంతోష్‌రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

లింగంపేట, మార్చి 29: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి శనివారం తనిఖీ చేశారు. జిల్లాలోని పలు చోట్ల పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ జరగడంతో కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అయన వెంట హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, సోలార్ లైట్ల అందజేత

బిచ్కుంద, మార్చి 29 : జుక్కల్ మండలంలోని పడంపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, సోలార్ లైట్లను జుక్కల్ యూత్ ఫోరం సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో గ్రా మ కార్యదర్శి గంగాధర్, యూత్‌ఫోరం అధ్యక్షుడు గైక్వాడ్‌విఠల్, దేవీదాస్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు పరమేశ్‌యాదవ్, భీంరావు, బస్వంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల నిధులతో పనులు చేపట్టనున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, పెంటయ్య, అంజయ్య, విశ్వనాథం, కిషన్, భూమన్న దితరులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా నుంచి కాపాడాలని వినతి

లింగంపేట, మార్చి 29: మండలంలోని కేశాయిపేట గ్రామ శివారులోని అల్లూరమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూమిని కబ్జానుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు శనివారం తహసీల్దార్ సురేశ్‌తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లూరమ్మ ఆలయ పరిసరాల్లో సుమారు పది ఎకరాల స్థలం ఉండగా దానిలో నుంచి మినీ పార్కు, మెగా పార్కు, క్రీడా ప్రాంగణం కోసం కేటాయించారన్నారు. మరికొంత భూమిని సహకార సంఘం వారికి అప్పగించగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరికొంత భూమిని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన పొన్న నరేశ్ అనే వ్యక్తి ఆక్రమించుకుంటున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్‌తో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కేశాయిపేట గ్రామస్తులు తెలిపారు.